ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
బుధవారం 8 మే 2024



కొండా మురళీధర్‌తో కలిసి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన కడియం కావ్య, మంత్రి సురేఖ


వరంగల్ పోచమ్మమైదాన్ వద్ద జరిగిన కాంగ్రెస్ రోడ్ షోకు హాజరైన ప్రజలు



వరంగల్‌ను చరిత్రలో నిలుపుతాం..

- రాష్ట్రంలో ఇంకో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే..
- ఐదు నెలల్లోనే ఐదు గ్యారంటీల అమలు
- బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటే..
- పోచమ్మమైదాన్ కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

వరంగల్ సిటీ/పోచమ్మమైదాన్, మే 7: వరంగల్‌ను చరిత్రలో నిలిచేలా చేస్తానని.. ప్రజల కోసం రక్తం చిందించిన నేల ఇదని, వరంగల్.. హైదరాబాద్‌లా అభివృద్ధి చెందాల్సిన నగరమని, రాణిరుద్రమ సాక్షిగా ఔటర్ రింగ్‌రోడ్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఏయిర్‌పోర్టు, టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని, అభివృద్ధి చేసి వరంగల్‌ను చరిత్రలో నిలుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి వరంగల్‌లోని పోచమ్మమైదాన్‌లో అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యం లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న కోటి మంది ఆడ బిడ్డల్ని కోటీశ్వరుల్ని చేస్తామని, వచ్చే పదేళ్ల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందన్నారు. 'మా ఆడబిడ్డలు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్నారు. రూ.500లకే సిలిండర్లు ఇస్తున్నాం. పేదోళ్ల ఇంటికి ఉచిత కరెంట్ ఇచ్చాం' అని సీఎం వెల్లడించారు. నీపంటే పండాలి, నీ ఇల్లే నిండాలి, నీవు పచ్చగా ఉండాలనుకునే కేసీఆర్ నువ్వేం నాయకుడివి.. నీలాంటి వాళ్లు ఎంతో మంది కాలగర్భంలో కలిసిపోయారు అంటూ ధ్వజమెత్తారు. డిసెంబరు 7న 7లక్షల కోట్ల అప్పుతో బాధ్యత తీసుకుంటే.. నేటికి సరిగ్గా ఐదు నెలల్లో మీరు చేసిన విధ్వంసాన్ని సరిదిద్దుతూ ఐదు గ్యారెంటీలను అమలు చేశామన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఆరోపణలు చేయడమేమిటన్ని ప్రశ్నించారు.

కావ్యకు ఆషామాషిగా టికెట్ ఇవ్వలేదు..

కడియం కావ్యకు ఆషామాషీగా టికెట్ ఇవ్వలేదని, కడియం శ్రీహరి 35ఏళ్లుగా నిజాయితీగా పనిచేయడంతోనే ఆయన వారసురాలుగా కావ్యను మీ ముందుకు తీసుకువచ్చామని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న చిత్తశుద్ధిని చూసి టికెట్ కేటాయించడం జరిగిందన్నారు. కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

గొప్ప వ్యక్తులు తిరిగిన గడ్డ ఇది..

ప్రొఫెసర్ జయశంకర్, కాళోజీ నారాయణ రావు లాంటి గొప్ప వ్యక్తులు తిరిగిన ప్రాంతమేకాక, రాణి రుద్రమదేవి పాలించిన ప్రాంతమని సీఎం గుర్తు చేశారు. నమ్మిన ప్రజల కోసం పోరాటం చేసి రక్తం చిందిన సమ్మక్క, సారలమ్మ, జంపన్న కదలాడిన

ప్రజల కోసం రక్తం చిందించిన గడ్డ ఇది..

ప్రాంతమన్నారు. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాలకు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యమకారులు ఉవ్వెత్తున ఉద్యమాన్ని నడిపి తెలంగాణ సాధించారన్నారు. వెయ్యిస్థంబాల గుడి, రామప్ప దేవాలయం, గొప్ప చరిత్రకు వన్నె తెవాల్సిన చంద్రశేఖర్‌రావు వారి పరిపాలనలో ఈ ప్రాంతం మసకబారి పోయిందన్నారు. మంత్రి సురేఖ కోరిక మేరకు గుడి, చర్చి, దర్గా నిర్మాణానికి ఒక్కోదానికి కోటి రూపాయల నిధులను జూన్ 30 లోపు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : కొండా దంపతులు

మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ అభివృద్ధిలో వెనకబడిన వరంగల్ నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎంను కోరారు. తాము గతంలో కొట్లాడి నిధులు తెచ్చి తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే, తర్వాత మిషన్ భగీరథ పేరుతో రోడ్లన్నీ తవ్వి గుంతల మయంగా చేశారని ఆరోపించారు. నాలాల నిర్మాణం సరిగా లేక ముంపునకు గురవుతున్నాయన్నారు. ఎన్నికల అనంతరం మాస్టర్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని కోరారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నగరానికి సంవత్సరానికి రూ. 300కోట్ల నిధులు కేటాయిస్తున్నామని చెప్పి మాట తప్పారన్నారు.

9న రైతుల ఖాతాల్లో డబ్బులు..

బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఎన్ని కుట్రలు చేసినా మే 9న రైతుల ఖాతాలో పైసలు వేస్తానని సీఎం స్పష్టం చేశారు. రైతు రుణమాఫీపై హరీష్‌రావు మాట్లాడుతున్నారని, మామ ఆణిముత్యమట, అల్లుడు స్వాతిముత్యమని ఎద్దేవా చేశారు. అప్పుడే దిగిపో దిగిపో అంటున్నారని, దిగి పోవడానికి మీలాగా రాలేదు ఎంతో మందిని తొక్కుకుంటా తొక్కుకుంటా వచ్చి ఈకుర్చిలో కూర్చున్నన్నారు. మాట్లాడాలంటే ఏబీసీడీ వర్గీకరణపై సంపూర్ణమైన పట్టున్న కడియం కావ్య లాంటి వారు కావాలన్నారు. బీజేపీ టికెట్ పొందిన ఆయన ఓ అనకొండ లాంటి వారని, భూములు కనబడితే మింగేస్తాడని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి ఎవరయ్యా అంటే బీఆర్ఎస్ మనిషి. బీఆర్ఎస్ వాళ్లే బీజేపీలోకి పంపించారని అన్నారు బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని అన్నారు. మాదిగల ఏబీసీడీ వర్గీకరణ చేయాలంటే ఢిల్లీ సుప్రీం కోర్టులో కొట్లాడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే: కావ్య

కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేనని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో నగర అభివృద్ధి కుంటుపడిపోయిందన్నారు. వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేసిన పాపం ఉరికే పోలేదన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



కమలంలో మోదీ మేనియా!

వరంగల్ లోక్‌సభ స్థానంలో పట్టుకు కాషాయ పార్టీ ప్రయత్నాలు

- బీజేపీ అభ్యర్థి అరూరి గెలుపు కోసం నేడు వరంగల్‌కు ప్రధాని
- మోదీ ఇమేజ్ కలిసొస్తుందన్న ఆశల్లో కమల దళం
- ఓరుగల్లు అభివృద్ధిలో కేంద్రం వంతును వివరిస్తున్న నేతలు
- నేటి జనగర్జన బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు
- సభలో ప్రధాని ఇవ్వబోయే హామీలపై ప్రజల్లో ఆసక్తి

బీజేపీ సభకు ఏర్పాట్లు పూర్తి 7

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల కోట ఓరుగల్లుపై కమలం పార్టీ కన్నేసింది. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ సీటును కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. 40 ఏళ్ల తరువాత ఈ నియోజకవర్గంలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందనే అంచనాల్లో ఆ పార్టీ నేతలున్నారు. ప్రధాని మోదీ మేనియాతో వరంగల్‌లో పాగా వేయాలని బీజేపీ వ్యూహాలు పన్నుతోంది. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా వ్యూహాత్మకంగా వ్యవహరించిన అధినాయకత్వం.. అరూరి రమేష్‌ను ఎంపీ అభ్యర్థిగా బరిలోదించింది. అలాగే ఎంతో కీలకమైన ఎస్సీ వర్గీకరణ హామీతో పాటు వరంగల్ అభివృద్ధి ఎజెండాను తెరపైకి తీసుకొచ్చి ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తోంది. బుధవారం వరంగల్ నిర్వహించే ఓరుగల్లు జనగర్జన సభకు ప్రధాని మోదీ వస్తుండటంతో భారీగా జనసమీకరణ చేసి బల నిరూపణకు స్థానిక బీజేపీ నాయకత్వం సిద్ధమవుతుండటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

వరంగల్ లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు

రాష్ట్రంలో సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు గెలవాలన్న లక్ష్యం పెట్టుకున్న బీజేపీ.. వరంగల్ సీటుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. 1984లో దేశవ్యాప్తంగా ఆ పార్టీ కేవలం రెండు ఎంపీ సీట్లనే గెలవగా.. అందులో వరంగల్ ఒకటి. నాడు హనుమకొండ ఎంపీ అభ్యర్థిగా బీజేపీకి చెందిన చందుపట్ల జంగారెడ్డి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. అప్పటి నుంచి మళ్లీ బీజేపీ గెలిచింది లేదు. కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వలేదు. 40ఏళ్లుగా గెలుపు కోసం ఊవ్విళ్లూరుతున్న బీజేపీకి ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు ఆశలు రేకిస్తున్నాయి. దీంతో వ్యూహాత్మకంగా బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ని బీజేపీలో చేర్చుకుని వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి ఎన్నికల క్షేత్రంలోకి కమలనాథులు దిగారు. అరూరికి వరంగల్ వ్యాప్తంగా ఉన్న వ్యక్తిగత పరిచయాలతో పాటు పాత బీఆర్ఎస్ కేడర్‌ను కమలం గూటికి తీసుకరావటంలో కొంత వరకు విజయం సాధించడం బీజేపీకి ఊపు తీసుకవచ్చిందనే చర్చ జరుగుతోంది. అలాగే అరూరి రమేష్‌కు పోల్ మేనేజ్‌మెంట్‌లో పట్టుండటంతోపాటు లోక్‌సభ పరిధిలోని అన్ని గ్రామాల నేతలతో స్వయంగా మాట్లాడటం కూడా కేడర్‌లో ఉత్సాహం నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మద్దతు కూడా అరూరి రమేష్‌కు ఇవ్వటంతో ఎమ్మార్పీఎస్ నేతలు రమేష్ గెలుపు కోసం ఊరూరా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ అనుకూలాంశాలతో బీజేపీ వరంగల్‌లో పాగా వేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది.

మోదీ చరిష్మాపై ఆశలు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ చరిష్మాపై బీజేపీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. మూడోసారి కూడా ప్రధానమంత్రిగా మోదీనే అధికారంలోకి వస్తారని నమ్ముతున్న బీజేపీ.. వరంగల్‌లో కూడా మోదీ మేనియా ఉందని విశ్వసిస్తోంది. అంతేకాకుండా వరంగల్‌కు పదేళ్ల కాలంలో మోదీ నేతృత్వంలో చేసిన, చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను బీజేపీ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లుతున్నారు. వరంగల్‌కు స్మార్ట్ సిటీ, హెరిటేజ్ సిటీగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసి అభివృద్ధి చేస్తోందని వివరిస్తున్నారు. అలాగే కాకతీయుల కాలం నాటి రామప్పకు ప్రపంచవారసత్వ కట్టడంగా గుర్తింపు తీసుకవచ్చింది కూడా బీజేపీనే అని, తెలుగు రాష్ట్రాల్లో యునెస్కో

మిగతా 8వ పేజీలో..

నేడు వరంగల్‌కు నరేంద్రమోదీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్‌కు వస్తుండటంతో బీజేపీ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. బుధవారం ఉదయం 10గంటలకు వరంగల్ నగర సమీపంలోని తిమ్మాపూర్ రోడ్డులో గల లక్ష్మీపురం వద్ద భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది జూలై 8న వరంగల్‌కు వచ్చిన మోదీ.. పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు నిర్వహించారు. ఈసారి ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారానికి వస్తుండటంతో పాటు వరంగల్ సీటును బీజేపీ నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. దీంతో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్, పరకాల నియోజకవర్గాల నుంచి భారీగా జనాన్ని సమీకరించాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. భూపాలపల్లి, పాలకుర్తి నుంచి జనసమీకరణకు కసరత్తు చేస్తున్నారు. సుమారు లక్షన్నర మందిని సభకు తరలించి సత్తా చాటాలని బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ వ్యూహరచన చేస్తున్నారు. ఉదయమే సభ ఉండటంతో నగరం చుట్టుప్రాంతాల నుంచి ఎక్కువ మందిని సభకు తరలించాలని బీజేపీ నేతలు కసరత్తు చేస్తున్నారు.

నేను పక్కా లోకల్

- కడియం కావ్యది గుంటూరు
- సుధీర్‌కుమార్‌ది కరీంనగర్ లోక్‌సభ
- శ్రీహరి డూప్లికేట్ దళితుడు
- దమ్ముంటే నా భూకబ్జాలు నిరూపించాలి
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్


మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న అరూరి రమేశ్

ప్రాణం తీసిన గాలివాన

- చెట్టు కూలి యువకుడి మృతి


దయాకర్(ఫైల్)

వర్ధన్నపేట రూరల్, మే 7: గాలివాన ఓ యువకుడి ప్రాణం తీసిన ఘటన మండలంలోని కట్ర్యాల గ్రామశివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన ఆబర్ల రమా శ్రీను దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారు డు ఆబర్ల దయాకర్(20) బీటెక్ చదువుతున్నాడు. తమ వ్యవసాయ క్షేత్రంలోని గడ్డిని ట్రాక్టర్‌లో తీసుకుని వెళ్లి సంగెం మండలంలోని ఓ పౌల్ట్రీ ఫాంలో అమ్మి, తిరిగి వస్తున్నారు. కట్ర్యాల శివారులోని జాతీయ రహదారి రోడ్డు ప క్కనే ఉన్న ఎండిపోయిన చెట్టు గాలివానకు ట్రాక్టర్‌పై పడింది. ఈ ఘటన లో ట్రాక్టర్ వెనక డబ్బాలో కూర్చున్న దయాకర్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ పిట్టల నవీన్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. దయాకర్ వరంగల్‌లోని గణపతి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఎక్స్‌కవేటర్ సాయంతో ట్రాక్టర్‌పై పడి న చెట్టును తొలగించి మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించారు.


కట్ర్యాల శివారులో సహాయక చర్యలో పాల్గొన్న ఎస్ఐ

మంగళవారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 38.5°C
కనిష్ఠం : 27.0°C

కాంగ్రెస్ అంటేనే కరువు..!

- కడియం ద్రోహి, అరూరి మోసకారి..
- వారిద్దరినీ ప్రజలు వద్దనుకుంటున్నారు..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


వర్ధన్నపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట రూరల్, మే 7 : కాంగ్రెస్ పార్టీ అంటేనే కరువుకు కేరాఫ్ అడ్రస్ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. మంగళవారం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశంలో వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్, మాజీ స్పీకర్ మధుసూదనాచారితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదేండ్ల పాటు రెప్పపాటు కూడా కరెంటు పోలేదని, తాగు, సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనతో రాష్ట్రంలో కరువు ఏర్పడిందని, ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని మోసం చేసిన కడియం శ్రీహరి ద్రోహిగా నిలిచిపోయాడని, పదేండ్లు ఎమ్మెల్యేగా ఉన్న అరూరి రమేశ్ పార్టీని మోసం చేశాడని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి సంక్షేమం కనపడిందని, కాంగ్రెస్ వచ్చాక ఆగం, అధోగతి కనిపిస్తుందని ఆరోపించారు. చల్లగా ముందుకు పోతున్న రాష్ట్రాన్ని ఆగం చేసిన కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని సూచించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఒక ఉద్యమకారుడికి ఇద్దరు మోసగాళ్లకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవని గుర్తు చేశారు. తెలంగాణ కోసం గొంతెత్తి, తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, అందుకే పార్లమెంటులో మన బీఆర్ఎస్ గళం వినిపించడానికి గులాబీ దళం ఉండాలన్నారు. మార్పు అనగానే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని, కానీ రుణమాఫీ, రైతు బంధు, మహిళలకు రూ. 2500 వచ్చాయా అంటూ..ప్రశ్నించారు. మార్పు కావాలని కోరుతున్న ప్రజలకు మార్పు రాలేదని, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిందన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా రుణమాఫీ పేరిట రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసి ఓట్లు అడుగుతున్నారని ఎర్రబెల్లి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఎందుకు ఓటు వెయ్యాలో చెప్పకుండా దేవుడిపై ఒట్లు వేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీకి చేసిన మోసానికి శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీలో చేరిన అరూరి సైతం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని, వీరికి ఓటుతోనే సమాధానం చెప్పాలని సూచించారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మొద్దు : సుధీర్‌కుమార్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని వరంగల్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుడినైనా తనను కేసీఆర్ పిలిచి ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టడం

మిగతా 8వ పేజీలో..

మేడిగడ్డను పరిశీలించిన జస్టిస్ పీసీ ఘోష్

● అరగంట పాటు పర్యటన.. పలు అంశాలపై అధ్యయనం ● కుంగుబాటుకు గల కారణాలు, సాంకేతిక పరమైన అంశాలపై ఆరా



బ్యారేజీలో కుంగిన 20వ పిల్లరు వద్ద వివరాలు తెలుసుకుంటున్న జస్టిస్ పీసీ ఘోష్

మహదేవపూర్ రూరల్/కాటారం, మే 7: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్, సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి పినాకి చంద్ర ఘోష్ మంగళవారం సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం నీటిపారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో సందర్శించారు. మధ్యాహ్నం 1.40 గంటలకు మేడిగడ్డకు చేరుకున్న ఆయన బ్యారేజీ వంతెన పైనుంచి కుంగిన పిల్లర్లను పరిశీలించిన అనంతరం వంతెన కింద కుంగుబాటుకు గురైన 7వ బ్లాకులోని 19, 20, 21వ పిల్లర్లను పరిశీలించిన ఆయన మధ్యాహ్నం 2.11 గంటలకు అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని భోజన విరామం తీసుకున్నారు. సుమారు గంటన్నర పాటు ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయంలోనే ఉన్న ఆయన సాయంత్రం 4 గంటలకు తిరిగి కాళేశ్వరాలయంలో దర్శనానికి వెళ్లారు.

త్వరలోనే పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం : పీసీ ఘోష్

కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ బ్యారేజీ నిర్మాణ సంస్థకు పలు సూచనలు చేసినట్టు తెలిసింది. 'బ్యారేజీ నిర్మాణం చేసింది మీరే. దానిని పునరుద్ధరించాల్సిన బాధ్యత కూడా మీపైనే ఉంది' అని సంస్థ ప్రతినిధులతో వ్యాఖ్యానించినట్టు సమాచారం. బ్యారేజీ నిర్మాణ సమయంలో సాంకేతిక పరమైన అంశాలకు సంబంధించి పలు విషయాలను క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ వెంకటకృష్ణతో పాటు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీలో 19, 20, 21వ పిల్లర్లను పరిశీలించిన ఆయన పగుళ్లు, బ్యారేజీ దెబ్బతినడానికి గల పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడిన పీసీ ఘోష్ కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగానే మేడిగడ్డ బ్యారేజీని క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. అయితే ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై అభిప్రాయం ఏంటని విలేకరులు అడగగా ఆ నివేదిక ఇంకా తమ వద్దకు రాలేదని, రాగానే దానిని విశ్లేషిస్తామని తెలిపారు. బ్యారేజీ పరిశీలనలో ఏదైనా లోపాన్ని గుర్తించారా.. అని మరో విలేకరి ప్రశ్నించగా తానేమీ ఇంజనీర్‌ను కాదని.. కుంగుబాటుకు గల కారణాలను ఇప్పుడే గుర్తించలేమన్నారు. త్వరలోనే సాంకేతిక నిపుణులతో కలిసి పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు. జస్టిస్ వెంట ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్, ఈఎన్‌సీ నాగేందర్‌రావు, కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే, సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ తిరుపతిరావు, డీఈఈ సురేష్, ఎల్‌అండ్‌టీ ప్రాజెక్టు మేనేజర్ రజనీష్ తదితరులున్నారు.



బ్లాక్-7లో పరిశీలన చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఫిరోజ్ పాషా మృతదేహం

వరంగల్ క్రైం, మే 7: అనుమానాస్పద స్థితిలో మహ్మద్ ఫిరోజ్ పాషా(37) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సుబేదారి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రంగశాయిపేటకు చెందిన మహ్మద్ రబ్బాని పెద్ద కుమారుడు ఫిరోజ్‌పాషా తాగుడుకు బానిసకావడంతో అతడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తాగుడు మానేసిన ఫిరోజ్ పాషా ఆటో నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఒక మహిళ రబ్బానికి కాల్ చేసి మీ కుమారుడు న్యూశాయంపేట రోడ్డుపై చనిపోయి ఉన్నాడని చెప్పింది. వెళ్లి చూసిన రబ్బాని రోడ్డుపై తీవ్రగాయాలతో మృతి చెందిన వ్యక్తి తన కుమారుడు ఫిరోజ్ పాషా అని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రబ్బాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మహిళలు సామాజిక సేవ చేయడం

అభినందనీయం

● సైబర్ క్రైమ్ ఏసీపీ కుంజ విజయ్‌కుమార్
● చక్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖులకు సన్మానం




వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులను సన్మానిస్తున్న చక్రి ఫౌండేషన్ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, మే 7: సామాజిక సేవలో మహిళలు ముందుకు రావడం అభినందనీయమని వరంగల్ సైబర్ క్రైమ్ ఏసీపీ కుంజ విజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళా రంగాలలో రాణిస్తున్న ప్రముఖులకు చక్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ లక్ష్మీపురంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో చక్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్మన్ చెట్టిపల్లి దేవిక అధ్యక్షతన నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఏసీపీ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవిక భర్త పేరున ఫౌండేషన్ స్థాపించి సామాజిక సేవలు చేయాలనే ఆలోచన రావడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథి, తెలంగాణ బీసీ సంఘం నాయకురాలు లయన్ పద్మజాదేవి మాట్లాడుతూ.. భర్తను కోల్పోయి కష్టాల్లో ఉన్నప్పటికీ స్వయం శక్తితో ఎదిగి సామాజిక సేవ చేయటానికి దేవిక ముందుకు రావడం గర్వించదగ్గ విషయమని ఆమె కొనియాడారు. ప్రత్యేక అతిథి బాల మానస మహా విద్యాపీఠం గురువర్యుడు లక్ష్మీనారాయణ గురు భవానీ మాట్లాడుతూ.. ఎన్నో రుగ్మతలు ఎదుర్కొని సామాజిక సేవలో ముందుకు సాగుతున్న దేవిక ఒక వ్యక్తి కాదని ఆమె ఒక శక్తి అని కొనియాడారు. దేవికను ఆదర్శంగా తీసుకొని మహిళలు సేవ రంగాలలో రాణించాలని ఆయన కోరారు. చక్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్మన్ చెట్టిపల్లి దేవిక మాట్లాడుతూ.. సమాజంలో పేదలు పడుతున్న బాధలను పంచుకోవాలనే ఉద్దేశంతో కరోనా సమయంలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలిచామన్నారు. స్వయం ఉపాధిలో కొన్ని కుంటుంబాలకు, మహిళలకు, చేయూతనివ్వడంతో పాటు వృద్ధులు, అనాథలు, మానసిక వికలాంగులకు, అంధులకు సహాయ సహకారాలను అందిస్తున్నామన్నారు. భర్త లేడనే బాధను దిగమింగుకొని సామాజిక సేవ చేయాలనే సంకల్పంతో పెద్దలు, మిత్రుల, సహకారంతో చక్రి ఫౌండేషన్ స్థాపించి సేవచేస్తూ సమాజంలో ప్రతీ నిరుపేద కళ్లలో ఆనందం చూడటమే తన లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలలో రాణిస్తున్న 35మంది ప్రముఖులను చక్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి మెమొంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్, విశ్వ కవి సిరాజోద్దీన్, రమేష్, ఫౌండేషన్ బాధ్యులు శ్రావణి, రాహుల్, శిల్ప, మౌనిక, అభి ఉదయ్, కృష్ణ, కీర్తి, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారంలో బల్లి

కేయూ కామన్ మెస్‌లో ఘటన.. ఆందోళనకు దిగిన విద్యార్థులు





హాస్టల్ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు, చట్నీలో పడిన బల్లి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 7: కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్‌లో ఉదయం పూట అల్పాహారం చట్నీలో బల్లి పడింది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గారు. హాస్టల్స్ డైరెక్టర్ పర్యవేక్షణ లేకపోవడంతోనే హాస్టల్స్ సిబ్బంది పరిశుభ్రత పాటించడం లేదని, మూడు నెలలుగా మెస్ బిల్లులు రూ.2వేలు దాటుతోందని ఆరోపించారు. నాసిరకం, నాణ్యతలేని కిరాణ సామగ్రితో తయారైన భోజనాలు చేయాల్సి వస్తోందని వారు హాస్టల్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కామన్ మెస్‌కు తాళం వేసి విద్యార్థులు ఆందోళన చేశారు. మెస్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని డైరెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. చట్నీలో బల్లి పడటానికి కారణమైన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో డైరెక్టర్ శ్రీనివాస్ రావు పూర్తి విచారణ జరిపి ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విదార్థులు ఆందోళన విరమించి భోజనం చేశారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి

విద్యుత్ అధికారులకు ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలు

హనుమకొండ టౌన్, మే7: టీఎస్ ఎన్పీడీఎసీఎల్ పరిధిలోని 16 సర్కిల్స్‌లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం నేపథ్యంలో సీఎండీ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ ఒక్క సిబ్బంది విధిగా హెడ్‌క్వార్టర్‌లో ఉండి సేవలందించాలన్నారు. మెన్ అండ్ మెటిరియల్‌ను సిద్ధం పెట్టుకోవాలన్నారు. అత్యవసరం ఉంటే వెంటనే స్పందించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకొని ఉంచుకోవాలన్నారు. గోదావరి తీరప్రాంతాలైన ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, అదిలాబాద్ పరిసర ప్రాంతాల్లోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా సరఫరా అందించాలన్నారు. అంతరాయాలు ఏర్పడితే ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్‌కు సంబంధించిన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎస్పీఎం షెడ్లలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు పెంచుకొని, రోలింగ్ స్టాక్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలను వెంటనే కార్పొరేట్ ఆఫీస్‌లోని కంట్రోల్ రూమ్‌కు చేరవేయాలన్నారు. జిల్లా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకెళ్లాలన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్ 18004250028 లేదా 1912 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించాలి

- ఎన్నికల జనరల్ అబ్జర్వర్ బండారి స్వాగత్ రణ్వీర్ చంద్


మీడియా సెంటర్‌లో ఎంసీఎంసీకి సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్న బండారి స్వాగత్ రణ్వీర్ చంద్

హనుమకొండ కలెక్టరేట్, మే 7: ఎన్నికలకు సంబంధించి ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులు అందితే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ అన్నారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, 1950, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్, సి విజిల్, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీడియో సర్వేలెన్స్ టీం మానిటరింగ్ సెల్‌లను మంగళవారం బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ పరిశీలించారు.

ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. వాటికి తీసుకున్న చర్యలు.. సోషల్ మీడియా మానిటరింగ్ సెల్, సి విజిల్‌కు ఎలాంటి ఫిర్యాదులు అందాయి, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ మానిటరింగ్ ఎలా జరుగుతుందనే వివరాలు ఎన్నికల అబ్జర్వర్‌కు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలకు సంబంధించిన రికార్డులను అబ్జర్వర్ తనిఖీ చేశారు. అదేవిధంగా మీడియా సెంటర్‌లో చేసిన ఏర్పాట్లను బండారి స్వాగత్ రణ్వీర్ చంద్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ఎంసీఎంసీకి సంబంధించిన రికార్డులను వారు పరిశీలించారు. మీడియా సెంటర్‌తో పాటు కంట్రోల్‌రూమ్‌లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాల పనితీరు బాగుండటంతో అబ్జర్వర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి

- రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య


రిజిస్టర్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 7: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని మూడు రోజులుగా నిర్వహిస్తున్న వరంగల్ లోక్‌సభ పరిధిలోని వరంగల్ జిల్లాకు సంబంధించిన వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల ఈవీఎంల కమిషనింగ్ మంగళవారం పూర్తయినట్లు రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయింపులు జరిపి, పరిశీలించి ఈవీఎంలను గోదాంలో భద్రపర్చి సీల్ వేసినట్లు తెలిపారు. ఈ ఈవీఎంలను ఈనెల 12న డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో సంబంధిత ప్రిసైడింగ్ అధికారులకు ఏఆర్‌ఓలు అందజేస్తారన్నారు. అలాగే కమిషనింగ్‌లో గుర్తించిన డిఫెక్టివ్ ఈవీఎంలు, సింబల్ లోడింగ్ యూనిట్లను సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నుంచి సేకరించి గోదాంలలో భద్రపర్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో సిదం దత్తు, తహసీల్దార్లు మహ్మద్ ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రిని పరిశీలించిన కమిషనర్


ఇండోర్ స్టేడియంలో పోలింగ్ సామాగ్రిని పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మే 7: లోక్‌సభ ఎన్ని కలు జరిగే పోలింగ్ కేం ద్రాల్లో ఎన్నికల సామగ్రి తగినంతగా ఉండాలని ఏఆర్‌వో, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికా రులకు సూచించారు. వరంగల్ నగర పాలక సంస్థ ఇండోర్ స్టేడియ ంలో పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉంచిన ఎన్నికల సామగ్రిని కమిషనర్‌తోపాటు సిబ్బంది కలిసి పరిశీలించారు. అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధిలో 230 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటికి సరిపడా స్టేషనరీతో పాటు అదనంగా మరికొంత స్టేషనరీ అందుబాటులో ఉంచాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్టేషనరీ నోడల్ అధికారి విజయలక్ష్మి, సూపరింటెండెంట్ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ, ఇండోర్ స్టేడియం పర్యవేక్షణాధికారి రవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నేను పక్కా లోకల్

- కడియం శ్రీహరి డూప్లికేట్ దళితుడు
- దమ్ముంటే నా భూకబ్జాలు నిరూపించాలి
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్


మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్

వడ్డెపల్లి, మే 7: కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యది గుంటూరు, బీ ఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ది కరీంనగర్ లోక్‌సభ పరిధి అని, తాను స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లు గ్రామానికి చెందిన వ్యక్తినని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. మంగళవా రం బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ద ప్రెస్'లో ఆయన మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మే కవన్నె పులి అని, కత్తులు కడుపులో పెట్టుకొని తిరుగుతున్న వ్యక్తి అని, ఆయ న వైఖరితో కాంగ్రెస్‌లోనే భయం మొదలైంది అన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత డాక్టర్ తాటికొండ రాజయ్య పదవులను బలవంతంగా గుంజుకొని రాజకీయ సమాధి చేసిన నీచుడు కడియం శ్రీహరి అని విమర్శించారు. అసలు లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యనా? లేక కడియం శ్రీహరినా.. తేల్చిచెప్పాలని అరూరి రమేశ్ డిమాండ్ చేశారు. తన భూకబ్జాలపై దమ్ముంటే నిరూపించాలని, ఓటమి భయంతోనే కడియం శ్రీహరి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని వి మర్శించారు. టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్నప్పుడు కడియం శ్రీహరి ఎన్‌కౌంటర్లు చేయించిన దుర్మార్గుడు అని, 30 యేళ్లుగా దళితుల రిజర్వేషన్లు అనుభవిస్తున్న డూప్లికేట్ దళితుడు అని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వర్ధన్నపేట ఎమ్మెల్యేగా తాను మూడోసారి గెలిస్తే మంత్రివర్గంలో పోటీకి వస్తానని తనపై కుట్రలు చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని పేర్కొన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కాంట్రాక్టర్ నుంచి కడియం డబ్బులు దండుకున్నది నిజం కాదా? అని అరూరి ప్రశ్నించారు. ఏ వ్యాపారాలు చేయని కడియం శ్రీహరికి బంగళాలు, ప్లాట్లు ఎలా వచ్చాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

వరంగల్ లోక్‌సభకు ఎన్నికయ్యేది తానేనని, కేంద్రంలో ఏర్పాటయ్యేది కూడా మోదీ ప్రభుత్వమేనని అరూరి పేర్కొన్నారు. తాను ఎంపీగా గెలిచిన త ర్వాత మామునూరులో ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, మడికొండలో ఐటీ కారిడా ర్, పాలకుర్తిలో టెక్స్‌టైల్ పార్కు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చే యించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తి వేస్తారని, రాజ్యాంగాన్ని మారుస్తారనేది దుష్ప్రచారం మాత్రమేనని, దీన్ని ఎవరూ నమ్మవద్దని అన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌తో ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అరూరి రమేశ్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన ని ర్వహించిన మీట్ ద ప్రెస్‌లో కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, వివిధ యూనియన్ల నాయకులు బీఆర్.లెనిన్, మెండు రవీందర్, గాడిపెల్లి మధు, గడ్డం రాజిరెడ్డి, బొక్క దయాసాగర్ తోపాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

బీజేపీ సభకు ఏర్పాట్లు పూర్తి

ఎస్పీజీ ఆధీనంలోకి సభా ప్రాంగణం


సభా ప్రాంగణంలో ఏర్పాట్లు

మిల్స్‌కాలనీ, మే 7: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఖిలావరంగల్ మండలంలోని లక్ష్మీపురంలో జరిగే బీజేపీ వరంగల్ జనసభకు హాజరవనున్నారు. ఈ సభ కోసం ఏర్పాట్లు పూర్తవగా.. సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా బీజేపీ శ్రేణులు వారం రోజులుగా కృషి చేస్తున్నాయి. వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ నేతృత్వంతో ఆ పార్టీ క్రమశిక్షణ సంఘం కమిటీ రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు పర్యవేక్షణలో సభా ప్రాంగణం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలోనే సభా ప్రాంగణాన్ని ఎస్పీజీ (స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్) మూడు రోజుల కిందటే ఆధీనంలోకి తీసుకొని ప్రధాని రక్షణ చర్యలను పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. 27ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభలో లక్ష మంది ప్రజలకు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు హాజరుకానున్నారు. మంగళవారం సభాప్రాంగణ ఏర్పాట్లను పరిశీలించిన అభ్యర్థి అరూరి రమేశ్.. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలన్నారు.

మోదీ పర్యటన ఇలా...

బుధవారం ఉదయం 8గంటలకు వేములవాడ రాజరాజేశ్వరుడిని దర్శించుకుని అనంతరం అక్కడి సభలో పాల్గొననున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. 10గంటలకు హెలికాప్టర్‌లో మామునూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. నాయకులు స్వాగతం పలికిన అనంతరం 4వ బెటాలియన్ లోపలి నుంచి 10:15కు నేరుగా సభాప్రాంగణానికి చేరుకుని ప్రసంగించి.. మళ్లీ మామునూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుని తిరుగుపయనమవుతారు.

నామినేషన్ దాఖలు చేసిన రాకేష్‌రెడ్డి


నామినేషన్ దాఖలు చేస్తున్న రాకేష్‌రెడ్డి

రాంనగర్, మే 7: బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం నల్లగొండ కలెక్టరేట్‌లో మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి రాకేష్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కాగా నామినేషన్ దాఖలుకు ముందు నల్లగొండ-హైదరాబాద్ రోడ్‌లో లక్ష్మీ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించి ర్యాలీగా కలెక్టరేట్ వరకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంత్రి కొండా వర్సెస్ ఎమ్మెల్యే రేవూరి?

- పార్టీలో చేరికల విషయమై వివాదం
- వైరల్ అవుతున్న మంత్రి సురేఖ, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఫోన్ సంభాషణ




గీసుగొండ, మే 7: పార్టీలో చేరికల విషయంలో వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఓ ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ కావటం మంగళవారం తీవ్ర చర్చనీయాంశమైంది. రాంపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రడం భరత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. గతంలో కొండా దంపతులకు ముఖ్య అనుచరుడిగా ఉన్న భరత్ ఎన్నికల అనంతరం మళ్లీ కొండా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన చేరిక పట్ల రేవూరి అసంతృప్తితో ఉన్నారని ఆ ఆడియో మేరకు అర్థమవుతోంది. ఆ ఫోన్‌సంభాషణలో మంత్రి సురేఖ మాట్లాడుతూ 'రడం భరత్ అంటే మీకు ప్రాబ్లమా అన్నా.. మా ఆధ్వర్యంలో అతను కాంగ్రెస్‌లో చేరారు. ఎందుకు అతడిని దూరం పెడుతున్నారు. నేను ఒక మినిస్టర్‌ని, భరత్‌ను అవమానపరిస్తే నన్ను అవమాన పరిచినట్టే' అన్నారు. దానికి రేవూరి సమాధానమిస్తూ... 'భరత్ యాటిట్యూడ్ నచ్చటం లేదు, ఎంపీపీ సౌజన్యతోపాటు పలువురు మండల నాయకులు అతడిని వ్యతిరేకిస్తున్నారు' అని సమాధానం ఇచ్చారు. దాంతో 'సౌజన్య సౌఖ్యం కాదు. ఆమెను మేమే ఎంపీపీ చేసిన విషయం మీకు తెలియదా' అని మంత్రి ఎమ్మెల్యేను ప్రశ్నించారు. 'మా ఆధ్వర్యంలో చేరిన భరత్‌ను మీరెందుకు కలుపుకోవటం లేదు' అని నిలదీయగా.. 'ఈ విషయాన్ని ముందే నాకు వివరిస్తే బాగుండేది' అని రేవూరి బదులిచ్చారు.

దానికి స్పందించిన మంత్రి 'పార్టీకి పనిచేస్తామని, పార్టీ సమావేశం కోసం పర్మిషన్ తీసుకున్న భరత్‌పై మీరు ఎందుకు కేసు పెట్టించారు, పార్టీకి నష్టం చేసిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్‌ను పార్టీలో ఎందుకు చేర్చుకోవాలనుకుంటున్నారు? ఎందుకు వర్గాలు చేస్తున్నారు' అంటూ రేవూరిని ప్రశ్నించారు. దాంతో 'ఫోన్‌లో ఇవన్నీ మాట్లాడలేం. తరువాత పర్సనల్‌గా మాట్లాడుతాం' అని రేవూరి అంటుండగా.. 'మీరు వర్గాలు చేయాలనుకుంటే నియోజకవర్గం మొత్తంలో మేము కూడా వర్గాలు చేస్తాం' అని సురేఖ ఘాటుగా స్పందించినట్టు ఆ ఫోన్ సంభాషణలో ఉంది.

మారుమోగిన చౌరస్తా

- సీఎం కార్నర్ మీటింగ్‌కు భారీగా హాజరైన జనం
- ఎర్రజెండాలతో కామ్రేడ్ల సందడి



హనుమకొండ కలెక్టరేట్/హనుమకొండ సిటీ/మడికొండ, మే 7: హనుమకొండ చౌరస్తాలో వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా మంగళవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. హనుమకొండ చౌరస్తాలో కార్నర్‌మీటింగ్‌ను పురస్కరించుకుని గిరిజనులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాంగ్రెస్ పార్టీకి వామపక్ష పార్టీలు మద్దతు ఇస్తున్న నేపథ్యంలో సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు తమ జెండాలు పట్టుకుని హనుమకొండ చౌరస్తాలో సందడి చేయడంతో చౌరస్తా ప్రాంతమంతా ఎర్రజెండాలతో ఎరుపెక్కింది. సీఎం కార్నర్ మీటింగ్‌ను పురస్కరించుకుని పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో అశోకా టాకీస్ జంక్షన్, హనుమకొండ బస్ స్టేషన్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, అంబేద్కర్ జంక్షన్ సమీపంలో ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

వరంగల్‌కు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ

వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మంజూరు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హనుమకొండలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో సీఎం మాట్లాడుతూ.. ఈ మేరకు డీపీఆర్‌ను సవరించి తనకు సమర్పించిన అనంతరం ప్రక్రియను వెనువెంటనే చేపడతామని వెల్లడించారు. వరంగల్ ప్రజలకు ఈ హామీ ఇస్తున్నట్లు ప్రకటించారు. వరంగల్‌కు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రతిపాదనను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రేవంత్‌రెడ్డికి తెలియచేయగా ఆయన వెంటనే స్పందిస్తూ ప్రకటించారు.

25 నిమిషాల ప్రసంగం

కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 25 నిమిషాల పాటు ప్రసంగించారు. 7:53 గంటలకు ఆయన ప్రచార వాహనంపైకి ఎక్కారు. 8:17 గంటలకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రకటనతో ప్రసంగాన్ని ముగించారు. ప్రసంగం మధ్యలో హనుమకొండ చౌరస్తా మజీద్‌లో నమాజు జరుగుతుండడంతో రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని కొద్దినిమిషాల పాటు నిలిపివేశారు.

మడికొండలో రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

హనుమకొండలో జరిగే కార్నర్ మీటింగ్‌కు వెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. ఈ సందర్భంగా సీఎం పార్టీ నాయకులకు అభివాదం చేసి నగరానికి వెళ్లారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రవిందర్, నర్మెట వెంకటరమణాగౌడ్, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కుర్ల మోహన్, బిల్ల రవిందర్ ఉన్నారు.

తల్వార్ తిప్పిన మంత్రి కొండా సురేఖ

హనుమకొండ కలెక్టరేట్, మే 7: హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీఎం కార్నర్ మీటింగ్‌కు ముందు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తల్వార్ చేత పట్టుకుని సందడి చేశారు. కొండా సురేఖను చూసిన అభిమానులు జై కొండా.. అంటూ నినాదాలు చేయడంతో సురేఖ తల్వార్ పట్టుకుని కొంత సేపు సందడి చేశారు.



వరంగల్‌కు బీజేపీ చేసిందేమీ లేదు : మంత్రి సీతక్క



హనుమకొండ కలెక్టరేట్, మే 7: గడిచిన పదేళ్ల బీజేపీ పాలనలో వరంగల్‌కు చేసిందేమీ లేదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్టజీవుల పార్టీ అని, కాంగ్రెస్‌ను నమ్ముకున్న ప్రతీ కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాబోయే రోజుల్లో వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. మే 13వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

వరంగల్‌ను అభివృద్ధి చేస్తా..

కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య



వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆదరించి గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య కోరారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో పని చేయడానికి రాజకీయాలలోకి వచ్చానని, డాక్టర్‌గా ఎంతో మంది పేద ప్రజలకు సేవ చేశానన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

సీఎం వస్తున్నాడనే వర్షం పడింది

వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

సీఎం రేవంత్ రెడ్డి వరంగల్‌కు వస్తున్నాడనే వర్షం పడిందని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఎంతో మంది రాజకీయ నాయకులు ఈ రోడ్లపై తిరుగుతూ చేయలేని హామీలు ఇచ్చారని, అలాంటి నాయకులు తిరిగిన ఈ రోడ్లు కలుషితమయ్యాయన్నారు. వరుణ దేవుడు వర్షం కురిపించి రోడ్లను శుభ్రం చేశాడని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్‌కు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తెచ్చుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.


కబ్జాకోరులకు ప్రజలు బుద్ధి చెప్పాలి : ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



వరంగల్‌లో ఎక్కడ చూసినా భూములన్నీ కొందరు నాయకులు కబ్జా చేశారని, అలాంటి కబ్జాకోరుల నాయకులకు ప్రజలు ఓటు రూపంలో బుద్ధి చెప్పాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అలాంటి కబ్జాకోరుల ఆగడాలు నడిచాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కబ్జాకోరులంతా ఇతర రాష్ట్రాల్లో తిరుగుతున్నారన్నారు. హనుమకొండ నగరాన్ని కొన్నిరోజుల్లోనే అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపిస్తే మనం ఎన్నో పనులు చేయించుకోవచ్చన్నారు.

బీజేపీ గెలిస్తే మణిపూర్ మంటలు పునరావృతం

- రాజకీయ, ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్


సదస్సులో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

సుబేదారి, మే 7: దేశంలో మరోసారి బీజేపీ గెలిస్తే మణిపూర్ మంటలు దేశమంతా ఆవహిస్తాయని రాజకీయ, ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో భారత్‌బచావో హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజకీయ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండ రామ్, గాదె ఇన్నయ్య హాజరయ్యారు.

ఈ సందర్భంగా పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు బీజేపీకి, భారత ప్రజలకు మధ్య జరగబోయే సంఘర్షణ అని, బీజేపీని ఓడించి లౌకికవాదాన్ని రక్షించాలన్నారు. ప్రజా సంఘాలు మాత్రమే దేశాన్ని రక్షిస్తాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక నిరుద్యోగం 63 శాతం పెరిగిందన్నారు. ప్రజల్లో మత విద్వేషాలు పెరుగుతున్నాయని, అవి తొలగించడానికి కొన్ని ఏళ్లు పడుతుందన్నారు. బీజేపీ గెలిస్తే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎలక్టోరల్ బాండ్లు అతిపెద్ద అవినీతి

బీజేపీ ఎలక్టోరల్ బాండ్లతో అతిపెద్ద అవినీతికి పాల్పడిందని విమర్శించారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని బీజేపీని ఓడించి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఉత్తర తెలంగాణ నుంచే ఉద్యమాలన్నీ తెలంగాణ మొత్తం ప్రవహిస్తాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మకానికి పెట్టి, సైనికులను కూడా కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటనారాయణ, రియాజ్, తిరుపతయ్య భారత్ బచావో రాష్ట్ర బాధ్యుడు జైసింగ్ రాథోడ్, జిల్లా చైర్మన్ ప్రవీణ్, మార్క శంకర్‌నారాయణ పాల్గొన్నారు.





'ఫళని' ఆధ్వర్యంలో అన్నదానం

వరంగల్ కల్చరల్, మే7: ఫళని సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య నాడు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఫళని సేవాదళ్ ఫౌండేషన్ చైర్మన్ బొడ్డ రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం అమావాస్య సందర్భంగా భద్రకాళి ఆర్చి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే నగరంలోని పాపయ్యపేట చమన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పబ్బతి సత్యనారాయణ, పడిశాల సుజాత, రాచర్ల శ్రీనివాస్, పార్శి కిషోర్, హర్ష పాల్గొన్నారు.

సీఎం మీటింగ్‌కు భారీగా తరలివచ్చిన జనం

వర్షంతో షెడ్యూల్ మార్పు

వరంగల్ సిటీ, మే 7: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ మంగళవారం పోచమ్మమైదాన్‌లో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి కార్నర్ మీటిం గ్‌కు కార్యకర్తలు, జనం భారీగా తరలివచ్చారు. తొలుత సీఎం వరంగల్ పర్యటన షెడ్యూల్ ప్రకారం సాయంత్రం ఐదు గంటలకు వరంగల్ పోస్టాఫీస్ సెంటర్ నుం చి వరంగల్ చౌరస్తా మీదుగా పోచమ్మమైదాన్ చేరుకుని సీఎం ప్రసంగించాల్సి ఉంది. అకస్మాత్తుగా గాలిదుమారం, వర్షంతో షెడ్యూల్ మారింది. సాయంత్రం ఆరు గంటల వరకే కాంగ్రెస్ కార్యకర్తలు పోచమ్మమైదాన్ సెంటర్‌కు చేరుకున్నారు. అప్పుడే వర్షం, గాలిదుమారం రావడంతో కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. చాల మంది వర్షానికి తడిసిపోయారు. రేవంత్‌రెడ్డి రాక కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చిరిగిపోయాయి. సీఎం పర్యటన రద్దు అవుతుందని నిరాశ చెందారు. కొందరు తిరి గి ఇళ్లకు చేరేందుకు ప్రయత్నించారు. ఇంతలో సీఎం షెడ్యూల్ మారింది. రోడ్డు మార్గాన తొలుత హనుమకొండ చౌరస్తాలో ప్రసంగించిన తరువాత పోచమ్మమైదా న్‌కు చేరుకుంటారని సమాచారం వచ్చింది. దీంతో కొండా దంపతుల ఆదేశాల మేరకు కాంగ్రెస్ ముఖ్య నాయకులు మళ్లీ కార్యకర్తలను కూడలికి రప్పించారు. సీఎంతోపాటు మంత్రులు రాత్రి ఎనమిదిన్నరకు పోచమ్మమైదాన్ కార్నర్ మీటింగ్ వద్దకు చేరుకుని తొమ్మిదిన్నర వరకు సమావేశంలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 24 నిమిషాల పాటు ప్రసంగించారు.





ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ కేంద్ర మంత్రి రాధాకృష్ణ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

మోదీ సభ ఏర్పాట్లను పరిశీలించిన నేతలు

కరీమాబాద్, మే 7: లక్ష్మీపురంలో నిర్వహించబోయే బీజేపీ జనసభ బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ కేంద్ర మంత్రి రాధాకృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను కోరారు. మంగళవారం సభా ప్రాంగణం వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనం పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధం నరేష్ పటేల్, కర్నె రవీందర్ ఉన్నారు.

- మిల్స్‌కాలనీ: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, ప్రధాని మోదీ పాల్గొంటున్న వరంగల్ జన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం 36వ డివిజన్‌లోని చింతల్, చంద్రవదన కాలనీ తదితర ప్రాంతాల్లో జన సభ ఆహ్వాన పత్రికలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ఇన్‌చార్జి కూచన క్రాంతి, అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, నాయకులు కొప్పుల శ్రీనివాస్, గుగులోత్ సురేష్, కొండా మహేశ్వర్, సృజన్, పి.సంతోష్, రాజు, శ్రీధర్, రాజ్‌కుమార్, రాజు, మధుకుమార్ పాల్గొన్నారు.

కమలంలో మోదీ మేనియా!

(5వ పేజీ తరువాయి)

గుర్తింపు పొందిన కట్టడంగా రామప్పను ఎంపిక చేయటంలో మోదీ పాత్ర ఉందని బీజేపీ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. రామప్ప అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.100కోట్లకు పైగా నిధులు కేటాయించిందని, వేయి స్తంభాల ఆలయంలోని కల్యాణ మండపానికి, వరంగల్ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి భారీగా నిధులు కేటాయించారని పేర్కొంటున్నారు. వీటితో పాటు కాజీపేటలో రూ.500కోట్ల వ్యయంతో రైల్వే తయారీ యూనిట్‌ను ప్రధాని ఇటీవలే భూమి చేశారని, అలాగే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును పీఎం మిత్ర పథకం కింద ఎంపిక చేశారని గుర్తు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో సఖ్యతగా వ్యవహరించకపోవడంతో అభివృద్ధి జరగలేదని బీజేపీ నేతలు చెబుతున్నారు. దీనికి తోడు బీజేపీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు పేదలకు చేరాయని చెబుతున్నారు. కేంద్రంలో మోదీకి ప్రత్యామ్నాయ నేతలు లేరని, మళ్లీ బీజేపీ సర్కారే అధికారంలోకి వస్తుందనే ధీమాలో ఆ పార్టీ నేతలున్నారు. అయోధ్య రామమందిరం నిర్మాణం కూడా తమకు కలిసొస్తుందనే అంచనాల్లో ఆ పార్టీ ఉంది. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలను తిప్పి కొడుతూనే బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లోకి అభ్యర్థి అరూరి రమేష్‌ని తీసుకెళుతోంది. మోదీ చరిష్మా, అభ్యర్థి అరూరి రమేష్ విస్తృత పర్యటనలు తమకు కలిసొస్తాయనే ఆశలో కమలనాథులున్నారు.

మోదీ హామీలపై ఆసక్తి..

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ అభివృద్ధికి ఏయే హామీలు ఇస్తారనే ఆసక్తి ఓటర్లలో కనిపిస్తోంది. ప్రధానంగా 2016లో కేంద్ర ప్రభుత్వం వరంగల్‌కు సైనిక్ స్కూల్‌ను మంజూరు చేసింది. అయితే గత ప్రభుత్వం సైనిక్ స్కూల్ ఏర్పాటుకు భూమిని కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. దీంతో సైనిక్ స్కూల్‌ను సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వరంగల్‌లోనే సైనిక్ స్కూల్ కొనసాగేలా మోదీ హామీ ఇస్తారనే ఆశతో ప్రజలున్నారు. అలాగే కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నవోదయ, కేంద్రియ విద్యాలయాల ఏర్పాటు, మామునూరు విమానాశ్రయాన్ని వినియోగంలోకి తీసుకు రావడంపై మోదీ భరోసా ఇస్తారా? అనే ఆశతో ఓటర్లు ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు వరంగల్ జిల్లాలో ఉన్న కీలక సమస్యలపై హామీలు ఇస్తారనే ఆశలో ఓటర్లున్నారు. కాగా, ప్రధానంగా పట్టణ ఓటర్లను కాషాయ పార్టీ ఎక్కువ లక్ష్యంగా చేసుకుంటోంది. వరంగల్ తూర్పు, పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ప్రధాని మోదీకి బలమైన మద్దతు లభిస్తుందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, భూపాలపల్లి నుంచి కూడా ఓటు బ్యాంకు భారీగా పెరుగుతుందన్న అంచనాల్లో ఆ పార్టీ నేతలున్నారు. కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థి బరిలో ఉండటంతో పక్కాగా గెలిచేలా అధిష్ఠానం వరంగల్ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. మొత్తానికి ప్రధానమంత్రి మోదీ మేనియాపై బీజేపీ శ్రేణులు ఆశలు పెట్టుకున్నారు.

అదనపు ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే7: ఈవీఎంల రెండో అదనపు సప్లమెంటరీ ర్యాండ మైజేషన్‌ను కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్‌వీర్ చంద్ ఆధ్వర్యంలో నిర్వహించామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్టేషన్‌ఘ నపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 బ్యాలెట్ యూనిట్లు, 50కంట్రోల్ యూనిట్లు, 10వీవీప్యాట్‌లు, పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 12 బ్యాలెట్ యూనిట్లు, 50 కం ట్రోల్ యూనిట్లు, 8 వీవీ ప్యాట్‌లను ఈఎంఎస్ వారు రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి ఆన్‌లైన్ ద్వారా కేటాయించామన్నారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల అదనపు కలెక్టర్లు జి.సంధ్యారాణి, రాధిక గుప్తా, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు ఇవి.శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, కుసుమ శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



కొనుగోలు కేంద్రంలో తనిఖీలు చేస్తున్న

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సంగెం, మే 7: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి కోరారు. మంగళవారం గవిచర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు తమ ధాన్యం తాలు లేకుండా 17శాతం తేమ కలిగి ఉండేలా చూసుకోవాలని సూచించారు. కాంటాలు అయిన వెంటనే నిల్వ ఉంచకుండా, మిల్లులకు తరలించాలన్నారు. అదే విధంగా కేంద్రాల్లో టార్పాలిన్స్ అందుబాటులో ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం సంధ్యారాణి, ఏపీఎం కిషన్, సీసీలు రాజయ్య, ఏలియా అంబిక, రజియా, మంజుల, లక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



శంభునిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ సువర్ణ, నాయకులు

ఖిలావరంగల్, మే 7: వరంగల్ పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ కోరారు. మంగళవారం తూర్పుకోట, గడ్డమీద, పడమరకోట, మధ్యకోట, ముస్లింకాలనీ, బుడిగ జంగాలకాలనీ, తదితర కాలనీలలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ సాధ్యంకాని హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజారాం, హరీష్, నగేష్, రాగూర్, శ్రీను, రాజు, కోమల తదితరులు పాల్గొన్నారు.

- కరీమాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. మంగళవారం డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి వనం కుమార్, కోరె కృష్ణ, దేవానంద్, రవి, గౌతమ్, చంద్రకళ, రాజన్‌బాబు, సాంబయ్య, రంజిత్, వెంకటేశ్వర్లు, నవీన్, రాజేందర్, మల్లేశం, రమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే కరువు..!

(5వ పేజీ తరువాయి)

సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ రాగానే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలడం మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌ల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. కడియం శ్రీహరి, అరూరి రమేష్, పసునూరి దయాకర్‌లు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. వీరిని పదేండ్ల పాటు అందలం ఎక్కించి పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించేలా చేస్తే తమ స్వార్థ రాజకీయాల కోసం పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆగం చేశారని తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్‌పార్టీకి మంచి రోజులు వస్తాయని, నాయకులు కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలిపించేలా గులాబీ సైనికులు పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మునిసిపాలిటీ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొండేటి శ్రీనివాస్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఆగమాగం

నర్సంపేట, మే 7: నర్సంపేట నియోజకవర్గ ప్రజలు గత నెల రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుతున్న ఎండలతో ఉక్కి రి బిక్కిరి అవుతున్న తరుణంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో గాలివాన కురిసింది. దీంతో అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. ఇళ్లపైనున్న రేకులు ఎగిరిపో యాయి. గాలిదుమారం కారణంగా చేతికందిన వరి నేలవాలిపోయింది. నర్సంపేట మార్కెట్‌తో పాటు పలు చోట్ల ధాన్యం మక్కల రాసులు వర్షాని కి తడవకుండా రైతులు పరదాలు కప్పుకున్నారు. గాలిదుమారానికి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

- ఖానాపురం: మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం, గాలి దు మారంతో రైతులు, ప్రజలు ఇబ్బందులుపడ్డారు. మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతుండటంతో రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి రాసులు పోశారు. వర్షం పడటంతో రైతులు పరదాల కోసం పరుగులు తీశారు. ధాన్యం రాసులపై పరదాలు కప్పి తడువకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గాలి దుమారంతో బుధరావుపేటలో గట్ల సతీశ్‌కు చెందిన ఇంటి రేకులు, బుధరావుపేట శివారులోని రామలింగయ్యపల్లెలో కృష్ణారెడ్డికి చెందిన ఇంటి పైకప్పు రేకులు లేచిపోవడంతో ఇండ్లు ధ్వంసమయ్యాయి. కోతకు వచ్చిన వరిపొలాలు అక్కడక్కడ నేలవాలాయి. వర్షంతో వరి కోతలకు అంతరాయం ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గాలి దుమారంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.
- చెన్నారావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో గాలివానతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యంపై రైతులు టార్పాలిన్ కవర్లు కప్పారు. మండల కేంద్రంలో సాదు మధుసూదన్‌రెడ్డికి చెందిన 12 ఎకరాలల్లోని మామిడితోటలో మామిడి కాయలు నెలరాలటంతో సుమారు రూ 3లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. చేతికి వచ్చిన వరి పంటలు పలు చోట్ల నెలవాలాయి.
- దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేటలో మంగళవారం గాలి దూమారానికి తాటి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో 2గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వరి పంటలు కోతకు రావడంతో పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆందోళన చేందుతున్నారు.
- వర్ధన్నపేట రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గాలితో కూడి న వర్షం కురిసింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఇప్పటికే కొంతమంది ఇంకా వరి పంటలను కోస్తుండగా, మరికొంత మంది కోసిన పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించారు. గాలివాన ప్రారంభం కావడంతో వెంటనే కేంద్రాల వద్దకు రైతులు పరుగులు తీసి పరదాలు కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నంచేశారు. రెండు రోజుల నుంచి గాలి వీస్తుండగా ఇప్పటికే మామిడి కాయలు రాలి కిందపడిపోతున్నాయి. ఇక రాత్రి వచ్చిన గాలివాన బీభత్సానికి పూర్తిస్థాయిలో మామిడి కాయలు రాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ధన్నపేటలో గాలికి పలు ఫ్లెక్సీలు11 కేవీ విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్‌ను నిలిపి వేశారు. మండలంలోని కట్ర్యాలలో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పై భారీ వృక్షం నేలకూలడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



దమ్మన్నపేట శివారులో మామిడి తోటలో రాలిన కాయలు

గీసుగొండలో ఈదురు గాలులు..

గీసుగొండ, మే 7: గత కొద్ది రోజులుగా మండే ఎండలతో తల్లడిల్లిపోతున్న ప్రజలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఉపశమనం లభించింది. మంగళవారం గీసుగొండ మండలంలో ఈదురు గాలులతో తేలికపాటి వర్షం పడింది. కాగా మొక్కజొన్న కోసిన రైతులు ఆందోళన పడుతున్నారు. వర్షానికి ఎండబోసిన మొక్కలు తడిసి పోవటంతో రైతులు మదనపడుతున్నారు. ఈదురు గాలులతో పలు చోట్ల చెట్లు విరిగి పడటంతో విద్యుత్ సరాఫరా కొన్ని గంటల పాటు అంతరాయం ఏర్పడింది. మునగ, అరటి చెట్లు విరిగి పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

'భద్రకాళీ బ్రహ్మోత్సవాలకు తరలిరావాలి'

వరంగల్ కల్చరల్, మే 7: భద్రకాళీ, భద్రేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలకు ముదిరాజ్‌లందరూ తరలిరావాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ కోరారు. మంగళవారం భద్రకాళీ ఆల యంలో బ్రహోత్సవాల కరపత్రాలను ఆలయ ప్రధాన పూజారి శేష సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్ర మంలో ముదిరాజ్‌లందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ నా యకులు బయ్య స్వామి, పులి రజనీకాంత్ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

అడ్డా కూలీలకు ఓటుపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారులు

వరంగల్ కార్పొరేషన్, మే 7: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్వీప్ - 2024 అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అడ్డా కూలీలకు, అరటి పండ్ల వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఓటు చైతన్యంపై రంగశాయిపేట మహంకాళి దేవాలయం ప్రాంతంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి హాజరై మాట్లాడారు. ఓటు ద్వారా మాత్రమే ప్రజలు ఆశించిన ఫలితాలు లభిస్తాయన్నారు. గతంలో పోలింగ్‌శాతం తక్కువగా జరగడం చాలా బాధాకరమని, ఈసారి కూలీలు, వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని అన్నారు. అనంతరం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ నోడల్ అధికారి సత్యవాణి, టీపీఆర్‌వో కోల రాజేశ్‌కుమార్, టీఎంసీ రమేష్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ఖిలావరంగల్, మే7: కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు శామంతుల శ్రీనివాస్ కోరారు. మంగళవారం శివనగర్‌లో కరపత్రాలు ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ పాలనలో పేదలకు చేసిందేమిలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పగడాల సతీష్, అక్షిత్‌పటేల్, కిరణ్, రాజు, సురేష్, సుధాకర్, వెంకన్న, మహిళా నాయకురాళ్ళు పాల్గొన్నారు

ఆర్టీసీ బస్ స్టేషన్‌లోకి చేరిన అన్నపూర్ణ క్యాంటీన్

గిర్మాజీపేట, మే7 : వరంగల్ ఆర్టీసీ పాత బస్‌స్టేషన్ ప్రాంగణంలో కొనసాగిన వరంగల్ మహానగర పాలక సంస్థ రూ.5 భోజనం అన్నపూర్ణ క్యాంటిన్ మంగళవారం తాత్కాలిక బస్‌స్టేషన్ ప్రాంగణం అందుబాటులో రావడంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలో కూరగాయల మార్కెట్ వైపు అన్నపూర్ణ క్యాంటిన్ ఏర్పాటు చేసిన విషయంతెలిసిందే. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రతిరోజు 600కు పైగా భోజనం చేసేవారు. ప్రస్తుతం బస్టాండ్‌ను మార్చడంతో క్యాంటీన్‌కు వచ్చేవారు పూర్తిగా తగ్గిపోయారు. ఈ విషయాన్ని గతనెల 23న ఆంధ్రజ్యోతి వరంగల్ సిటీ పేజీలో అన్నం ఒక చోట.. తినేవారు మరో చోట పేరుతో వార్తను ప్రచురించింది.

దీనిపై దృష్టి సారించిన కమిషనర్ అశ్వినితానాజీ వాకడే ఆదేశాలతో బల్దియా ముఖ్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేష్, స్థానిక శానిటరి ఇన్‌స్పెక్టర్ సంపత్ రెడ్డిలు సోమవారం వరంగల్ తాత్కాలిక బస్ స్టేషన్‌ను సందర్శించారు. అన్నపూర్ణ క్యాంటిన్ పాత బస్ స్టేషన్ నుంచి తాత్కాలిక బస్‌స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. దీంతో మంగళవారం క్యాంటిన్‌ను తాత్కాలిక బస్టాండ్ సమీపంలోకి మార్చడంతో గ్రామీణ ప్రాంత ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బస్‌స్టేషన్‌లో అన్నపూర్ణ క్యాంటిన్



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL బుధవారం 8 మే 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ఎరువుల షాపుల్లో తనిఖీలు

నెక్కొండ, మే 7: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను విక్రయించడమే కాకుండా ప్రతీ రైతుకు బిల్లు తప్పకుండా ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి డి. ఉషా దయాల్ ఆదేశించారు. మంగళవారం నెక్కొండలోని పలు ఎరువుల విక్రయ షాపులను ఆమె తనిఖీ చేశారు. షాపులకు సంబంధించిన గోదాముల్లో ఎరువుల నిల్వలను పరిశీలించి స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. షాపుల యజమానులు క్రమం తప్పకుండా స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని అప్పల్‌రావుపేట, వెంకటాపురం, నెక్కొండ గ్రామాల్లో పంటక్షేత్రాలను వ్యవసాయ అధికారి సందర్శించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున రైతులు వ్యవసాయ పనులను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో చేసుకోవాలన్నారు. వేసవిలో తప్పకుండా దుక్కులు దున్నడంతో నిద్రావస్థలో ఉన్న చీడపీడలు కలిగించే పురుగులు అధిక ఉష్ణోగ్రతల కారణంగా చనిపోతాయన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రత మిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారి సారంగం, ఏఈవో వసంత, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే కరువు..!

(5వ పేజీ తరువాయి)

సంతోషంగా ఉండన్నారు. కాంగ్రెస్ రాగానే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలడం మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌ల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. కడియం శ్రీహరి, అరూరి రమేశ్, పసునూరి దయాకర్‌లు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. వీరిని పదేండ్ల పాటు అందలం ఎక్కించి పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించేలా చేస్తే తమ స్వార్థ రాజకీయాల కోసం పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆగం చేశారని తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్‌పార్టీకి మంచి రోజులు వస్తాయని, నాయకులు కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలిపించేలా గులాబీ సైనికులు పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మునిసిపాలిటీ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొండేటి శ్రీనివాస్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

• జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల నోడల్ అధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 13న జరిగే పోలింగ్ ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్, విద్యుత్, తాగునీటి వసతికి సంబంధించి నోడల్ అధికారుల ద్వారా ఎన్నికల పనులు మే 10 వరకు పూర్తి చేయాలని చెప్పారు. పోలింగ్‌కు ముందు చేయాల్సిన వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ తర్వాత చేయాల్సిన ట్రాన్స్‌పోర్టు అంశాలపైన చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు, ఎన్నికల నియమావళి ననుసరించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతీ ఒక్క నోడల్ అధికారి వారికి కేటాయించిన విధులను మరోక సారి క్షుణ్ణంగా పరిశీలించుకుని, ఎలాంటి కంప్లైట్ రాకుండా చూడాలని, ఏదైనా ఫిర్యాదు వచ్చినట్లైతే చర్యలు ఉంటాయన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ మాట్లాడుతూ ఈవీఎం భద్రత, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధి విధానాలను నోడల్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

వర్ధన్నపేట రూరల్, మే 7 : పట్టణ శివారులోని సంగెపు వాగు వద్ద కారును వెనక నుంచి లారీ ఢీకొట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... తొర్రూరు నుంచి వరంగల్ వైపు లారీ వెళ్తుండగా, సోమేశ్వర్ రావు మిల్లు దగ్గరలోని డివైడర్ వద్ద తొర్రూరు వైపు వస్తున్న కారు ఒక్కసారిగా వరంగల్ వైపు యూటర్న్ తీసుకోవడంతో కారును లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో హనుమకొండకు చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తుండగా ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

గుడుంబా స్థావరాలపై దాడి

నెక్కొండ, మే 7: మండలంలోని చిన్నకొర్పోలు, చెరువుముందరి గ్రామం, కున్సీ తండాల్లో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి 45 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోవడంతో పాటు 3వేల లీటర్ల చెక్కర పానకాన్ని ధ్వంసం చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు, ఏఈఎస్ మురళీధర్, శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు రమేశ్‌చందర్, నాగేశ్వర్‌రావు, ఎస్సైలు రాజన్న, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సూరుపల్లి సొసైటీ చైర్మన్ సస్పెన్షన్

నెక్కొండ, మే 7 : నెక్కొండ మండలం సూరుపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఘంట దామోదర్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంగాని సూరయ్య మంగళవారం తెలిపారు. దామోదర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుండటంతో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు సూరయ్య తెలిపారు.



నర్సంపేటలో విరిగిన చెట్టు కొమ్మలు



బుధరావుపేటలో ధ్వంసమైన ఇల్లు



చెన్నారావుపేటలో ధాన్యంపై పరదాలు కప్పిన రైతులు



దమ్మన్నపేట శివారులో మామిడి తోటలో రాలిన కాయలు

అకాల వర్షంతో ఆగమాగం

• ఈదురుగాలులకు విరిగిన చెట్లకొమ్మలు • నేలవాలిన పంటలు • విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట, మే 7: నర్సంపేట నియోజకవర్గ ప్రజలు గత నెల రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుతున్న ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న తరుణంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో గాలివాన కురిసింది. దీంతో అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. ఇళ్లపైనున్న రేకులు ఎగిరిపోయాయి. గాలిదుమారం కారణంగా చేతికందిన వరి నేలవాలిపోయింది. నర్సంపేట మార్కెట్‌తో పాటు పలు చోట్ల ధాన్యం మక్కల రాసులు వర్షానికి తడవకుండా రైతులు పరదాలు కప్పుకున్నారు. గాలిదుమారానికి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

● ఖానాపురం: మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం, గాలి దుమారంతో రైతులు, ప్రజలు ఇబ్బందులుపడ్డారు. మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతుండటంతో రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి రాసులు పోశారు. వర్షం పడటంతో రైతులు పరదాల కోసం పరుగులు తీశారు. ధాన్యం రాసులపై పరదాలు కప్పి తడువకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గాలి దుమారంతో బుధరావుపేటలో గట్ల సతీశ్‌కు చెందిన ఇంటి రేకులు, బుధరావుపేట శివారులోని రామలింగయ్య పల్లెలో కృష్ణారెడ్డికి చెందిన ఇంటి పైకప్పు రేకులు లేచిపోవడంతో ఇండ్లు ధ్వంసమయ్యాయి. కోతకు వచ్చిన వరిపొలాలు అక్కడక్కడ నేలవాలాయి. వర్షంతో వరి కోతలకు అంతరాయం ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గాలి దుమారంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

● చెన్నారావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో గాలివానతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యంపై రైతులు టార్పాలిన్ కవర్లు కప్పారు. మండల కేంద్రంలో సాదు మధుసూదన్‌రెడ్డికి చెందిన 12 ఎకరాలల్లోని మామిడితోటలో మామిడి కాయలు నెలరాలటంతో సుమారు రూ 3లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. చేతికి వచ్చిన వరి పంటలు పలు చోట్ల నెలవాలాయి.

● దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేటలో మంగళవారం గాలి దూమారానికి తాటి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో 2గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వరి పంటలు కోతకు రావడంతో పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు.

● వర్ధన్నపేట రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఇప్పటికే కొంతమంది ఇంకా వరి పంటలను కోస్తుండగా, మరికొంత మంది కోసిన పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించారు. గాలివాన ప్రారంభం కావడంతో వెంటనే కేంద్రాల వద్దకు రైతులు పరుగులు తీసి పరదాలు కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నంచేశారు. రెండు రోజుల నుంచి గాలి వీస్తుండగా ఇప్పటికే మామిడి కాయలు రాలి కిందపడిపోతున్నాయి. ఇక రాత్రి వచ్చిన గాలివాన బీభత్సానికి పూర్తిస్థాయిలో మామిడి కాయలు రాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ధన్నపేటలో గాలికి పలు ఫ్లెక్సీలు11 కేవీ విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్‌ను నిలిపివేశారు. మండలంలోని కట్ర్యాలలో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై భారీ వృక్షం నేలకూలడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మోదీ ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి తరిమికొట్టాలి

రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

బ్లాక్ కాంగ్రెస్ సమావేశంలో మంత్రులు సీతక్క, తుమ్మల



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ఏటూరునాగారం, మే 7: రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యమని, మోదీ ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి తరిమికొట్టాలి, బీఆర్ఎస్, బూటకపు వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క పిలుపునిచ్చారు. మంగళవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస కల్యాణ మండపంలో పార్టీ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు చిటమట రఘు అధ్యక్షతన బ్లాక్ కాంగ్రెస్ పరిధిలోని ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, తాడ్వాయి మండలాల ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. మంత్రి సీతక్క మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ గుండెల్లో పెట్టుకుంటానని, కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు అమలు చేశామన్నారు. వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలు తెచ్చుకున్న ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై పనిచేస్తున్నాయని, కల్వకుంట్ల కుటుంబ పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకొని అప్పుల కుప్పలా మార్చారన్నారు. దేశంలో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మంత్రులు సీతక్క, తుమ్మల ఆధ్వర్యంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా యూత్ అధ్యక్షుడు బానోతు రవి చందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.అయ్యూబ్ ఖాన్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అర్రెమ్ లచ్చు పటేల్, డైరెక్టర్ చామంతి కిషోర్, తాడ్వాయి మండల పార్టీ అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మంగపేట మండల పార్టీ అధ్యక్షుడు జయరాంరెడ్డి పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్నవారిపై కేసు

పర్వతగిరి, మే 7: మండలంలోని దౌలత్‌నగర్ గ్రామ చెరువు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నవారిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా చెరువు నుంచి మొరం తరలిస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో అక్కడకు వెళ్లి ఒక హిటాచి, ఒక టిప్పర్, మూడు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న 8 మందిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విలేకరిని బెదిరించిన వ్యక్తిపై కేసు

దౌలత్‌నగర్ చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో కవరేజీకి వెళ్లిన అదే గ్రామానికి చెందిన ఒక దినపత్రిక విలేకరి గడ్డం రాజశేఖర్‌ను గడుదాసు చంద్రశేఖర్ అనే వ్యక్తి తన వద్ద పని చేసే మరికొందరితో కలిసి విలేకరి ఇంటికి వెళ్లి ఆయనతో పాటు కుటుంబసభ్యులను దుర్భాషలాడి బెదిరించాడు. దీంతో రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

రాయపర్తి, మే 7: మండలంలోని బందనపెల్లికి చెందిన మాజీ సర్పంచ్ చెవ్వ సంపత్ మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంపత్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాట్రపెల్లిలో గ్రామపార్టీ అధ్యక్షుడు మండల శ్రీధర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు శ్రీధర్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పూస మధు, అశ్రఫ్ పాషా, ఎల్లస్వామి, అన్వర్, రాజు, శ్రీను, కత్తి సోమన్న, రాజాలు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఠాగూర్ జయంతి

నర్సంపేట టౌన్, మే 7 : నర్సంపేట పట్టణంలోని లీడ్ లైబ్రరీలో రచయిత రవీంద్రనాథ్‌ఠాగూర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లీడ్ లైబ్రరీ నిర్వాహకులు కాసుల రవి కుమార్, శోభారాణిలు మాట్లాడుతూ ఠాగూర్ సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించే సంపూర్ణ విద్యను ప్రోత్సహించారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఓటు అడిగే నైతిక హక్కు ఆ పార్టీలకు లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నెక్కొండ, మే 7: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్న బీజేపీకి, కటుంబపాలనతో రాష్ట్రాన్ని అవినీతిమయం చేసిన బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు అడిగే నైతిక హక్కులేదని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ సూరుపల్లిలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండటంతో రోజు రోజుకూ ప్రజాదరణ పెరుగుతోందన్నారు .రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు.

సూరుపల్లి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఘంట దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సింగారపు గీతాభాస్కర్, చీకటి మధు, సురేశ్, రాజు, నవీన్‌తో పాటు 20 కుటుంబాలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు హరిప్రసాద్, డీసీసీ కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు బండి శివ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: ఇందిరమ్మ పాలనలో నిరుపేదలకు లబ్ది జరుగుతుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికలపై ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బలరాం నాయక్‌ను గెలిపించాలన్నారు. పత్తినాయక్‌తండా మాజీ సర్పంచ్ జాటోతు స్వామినాయక్, రాములు, అక్కల్‌చెడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భూక్యగోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవిందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి శ్రీనువాస్, పెండెం రామనంద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేశ్, తప్పెట రమేశ్, మాజీ ఎంపీపీ వీరారెడ్డి,పాల్గొన్నారు.

మోసపోతే... గోస పడతాం..

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి




కేశవపురంలో మాట్లాడుతున్న యశస్వినీరెడ్డి

రాయపర్తి, మే 7: పదేండ్లుగా బీజేపీ ప్రభుత్వం దేశంలో అధికారంలోకి ఉండి ప్రజలను మోసం చేసిందని, మళ్లీ మోసపోతే భవిష్యత్‌లో గోసపడాల్సి వస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కేశవపురం, ఎర్రకుంట తండా, జింకురాం తండాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో ఆమె మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల ఓట్ల కోసం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మళ్లీ నియోజకవర్గంలో తిరుగుతూ ఓట్లు అడుగుతున్నాడని, బీఆర్ఎస్ పార్టీ ఓటు వేసి వృధా చేసుకోవద్దని సూచించారు. ఎన్ని కుట్రలు చేసినా కడియం కావ్య గెలుపును ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచేలా కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. పదేండ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ పార్టీ ఒకవైపు, పదేండ్లు తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోని బీజేపీ ఒక వైపు వచ్చి ఇప్పుడు మళ్లీ మోసపూరిత మాటలతో ఓట్లు అడుగుతున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. కడియం కావ్య చేతి గుర్తుకు ఓటు వేసి సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు మాచర్ల ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, ముద్రబోయిన వెంకన్న, మహిళా అధ్యక్షురాలు మునిత తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని సన్నూరుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు 50 మంది పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో వారికి ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రైతులను కూలీలుగా మార్చిన కాంగ్రెస్..

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



అప్పల్‌రావుపేటలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ, మే 7 : కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల చెరువుల్లో నీరులేక ఎండిపోవడంతో రైతులను ఉపాధి కూలీలుగా మార్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కవితను గెలిపించాలని కోరుతూ మంగళవారం మండలంలోని దీక్షకుంట, సీతారాంపురం, పనికర, అప్పల్‌రావుపేట, వెంకటాపురం, తోపనపల్లి, బొల్లికొండ, అలంకానిపేట, నెక్కొండ గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులకు నీటినిల్వలపై అవగాహన లేక నదులోని నీటిని సముద్రంలోకి వదలడంతో చెరువుల్లో చుక్క నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంగాని సూరయ్య, సొసైటీ చైర్మన్ మారం రాము, నాయకులు కొమ్ము రమేశ్, కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, తాటిపల్లి శివకుమార్, ఈదునూరి యాకయ్య, యాసం బాలకిషన్, దామోదర్, భద్రయ్య, మాదాసు రవి, ఫకీర్‌హమ్మద్, బల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

నర్సంపేట, మే 7: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు, కొరబోయిన కుమారస్వామి, భూక్యసమ్మయ్య, నమీండ్ల స్వామి, ముంజాల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కమలంలో మోదీ మేనియా!

(5వ పేజీ తరువాయి)

గుర్తింపు పొందిన కట్టడంగా రామప్పను ఎంపిక చేయటంలో మోదీ పాత్ర ఉందని బీజేపీ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. రామప్ప అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.100కోట్లకు పైగా నిధులు కేటాయించిందని, వేయి స్తంభాల ఆలయంలోని కల్యాణ మండపానికి, వరంగల్ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి భారీగా నిధులు కేటాయించారని పేర్కొంటున్నారు. వీటితో పాటు కాజీపేటలో రూ.500కోట్ల వ్యయంతో రైల్వే తయారీ యూనిట్‌ను ప్రధాని ఇటీవలే భూమి చేశారని, అలాగే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును పీఎం మిత్ర పథకం కింద ఎంపిక చేశారని గుర్తు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో సఖ్యతగా వ్యవహరించకపోవడంతో అభివృద్ధి జరగలేదని బీజేపీ నేతలు చెబుతున్నారు. దీనికి తోడు బీజేపీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు పేదలకు చేరాయని చెబుతున్నారు. కేంద్రంలో మోదీకి ప్రత్యామ్నాయ నేతలు లేరని, మళ్లీ బీజేపీ సర్కారే అధికారంలోకి వస్తుందనే ధీమాలో ఆ పార్టీ నేతలున్నారు. అయోధ్య రామమందిరం నిర్మాణం కూడా తమకు కలిసొస్తుందనే అంచనాల్లో ఆ పార్టీ ఉంది. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలను తిప్పి కొడుతూనే బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లోకి అభ్యర్థి అరూరి రమేశ్‌ని తీసుకెళుతోంది. మోదీ చరిష్మా, అరూరి విస్తృత పర్యటనలు తమకు కలిసొస్తాయనే ఆశలో కమలనాథులున్నారు.

మోదీ హామీలపై ఆసక్తి

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ అభివృద్ధికి ఏయే హామీలు ఇస్తారనే ఆసక్తి ఓటర్లలో కనిపిస్తోంది. ప్రధానంగా 2016లో కేంద్ర ప్రభుత్వం వరంగల్‌కు సైనిక్ స్కూల్‌ను మంజూరు చేసింది. అయితే గత ప్రభుత్వం సైనిక్ స్కూల్ ఏర్పాటుకు భూమిని కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. దీంతో సైనిక్ స్కూల్‌ను సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వరంగల్‌లోనే సైనిక్ స్కూల్ కొనసాగేలా మోదీ హామీ ఇస్తారనే ఆశతో ప్రజలున్నారు. అలాగే కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నవోదయ, కేంద్రియ విద్యాలయాల ఏర్పాటు, మామునూరు విమానాశ్రయాన్ని వినియోగంలోకి తీసుకు రావడంపై మోదీ భరోసా ఇస్తారా? అనే ఆశతో ఓటర్లు ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు వరంగల్ జిల్లాలో ఉన్న కీలక సమస్యలపై హామీలు ఇస్తారనే ఆశలో ఓటర్లున్నారు. కాగా, ప్రధానంగా పట్టణ ఓటర్లను కాషాయ పార్టీ ఎక్కువ లక్ష్యంగా చేసుకుంటోంది. వరంగల్ తూర్పు, పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ప్రధాని మోదీకి బలమైన మద్దతు లభిస్తుందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, భూపాలపల్లి నుంచి కూడా ఓటు బ్యాంకు భారీగా పెరుగుతుందన్న అంచనాల్లో ఆ పార్టీ నేతలున్నారు. కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థి బరిలో ఉండటంతో పక్కాగా గెలిచేలా అధిష్ఠానం వరంగల్ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. మొత్తానికి ప్రధానమంత్రి మోదీ మేనియాపై బీజేపీ శ్రేణులు ఆశలు పెట్టుకున్నారు.